# పిచ్చి మా తల్లి



"చాలా బట్టలు చేరాయి బాబూ పాతవి. చిరగవు, పెట్టవు ఈ చీరలు. కట్టీ కట్టీ చిరాకేస్తోంది. స్టీలు సామాన్ల దాన్ని పిలిచి ఏదన్నా పుచ్చేసుకోవాలి. ఇంటినిండా గుడ్డలే." విసుక్కుంటోంది శ్యామల.

ఎప్పుడో వాళ్ళ అన్నయ్య ఫారిన్ వెళ్ళినప్పుడు పిల్లలకీ, పెద్దలకి తెచ్చి పడేసిన బట్టలవన్నీ. పాడవలేదు గానీ పిల్లలవి పొట్టయిపోయాయి. పెద్దలకి బోరయిపోయాయి. చీరలు చిరగలేదు గానీ కొత్తమాసిపోయాయి.

"ఇన్నేళ్ళు కట్టాము. వాటి ధర గిట్టుబాటయిపోయింది. ఇంక నేను ఈ చీరలు కట్టలేను." అని మళ్ళీ ఒకసారి నచ్చచెప్పుకుంది.

"స్టీలు సామాన్లది నీకు ఏం ఇస్తుంది చెప్పు. డబ్బాయో, గిన్నో అంతేకదా. పనిలో, పిల్లలకి పడేస్తే కాసుకోవచ్చు. ఆ పనిమనిషి చూడు. కుచేల సంతానంలా పిల్లల్ని వేసుకుని తిరుగుతుంది. వాళ్ళకి పడేస్తే చాలా రోజులు నీ పేరు చెప్పుకుని, దాచుకుని కట్టుకుంటారు. ఇద్దరు పిల్లలతోనే సతమతమయి పోతున్నాం మనం. అంతమందికి తిండే పెడుతుందా? బట్టలే కొంటుందా? మన లాంటి వాళ్ళం కాస్త ఆదుకోవాలి." అన్న భర్త మాటలు నిజమేనని పించాయి.

ఇన్ని బట్టలు తీసుకుని ఏదో పెద్ద ఉపకారం చేసినట్టు ఇంత డబ్బా చేతిలో పెడుతుంది. దాని బదులు వాళ్ళు నాలుగు రోజులు కట్టుకుంటే సంతోషమే.

మర్నాడు పని మనిషిని ఆపి ఆ బట్టలు ఇచ్చింది. దాని సంతోషం చూసి భర్త సలహా పాటించినందుకు తనకు తనే ముచ్చట పడింది శ్యామల. ముందర కొన్ని దాచి, కొన్నే ఇద్దామనుకుంది గానీ ఆరుగురు పిల్లలు, తలొక రెండు జతలు రావాలి గదా, ఇంకా వాటిని దాచి ఏం చేస్తాన'ని చీరలతో సహా అన్నీ ఇచ్చి చెత్తంతా వదిలించుకున్నానని సంతోషపడింది. ఆ రోజంతా గొప్ప త్యాగమూర్తిలా మురిసిపోయింది. 'మా తల్లే ఎంత దొడ్డ మనసమ్మా నీది" అంటూ పనిమనిషి అవన్నీ పట్టుకుని చక్కా పోయింది.

రోజులు గడుస్తున్నాయి. 'చాలా రోజులయింది సుజాతని చూసి' అనుకుని ఆ రోజు పనులన్నీ కానిచ్చి వాళ్ళింటికి బయలుదేరింది. వాళ్ళిద్దరూ కాలేజీలో స్నేహితులు, పెళ్ళయ్యాక ఒకే ఊళ్ళో కాపురం. గుమ్మంలో అడుగుపెట్టేసరికి సుజాత స్టీలు సామాన్ల దాన్ని పిలిచి దాని ముందర బట్టలు పోగుపెడుతుంది.

"ఎన్నాళ్ళయింది మనం కలుసుకుని! నేనే వద్దామనుకుంటున్నాను. ఈ మధ్య పిల్లలిద్దరికీ జ్వరాలు. కుదర లేదు" అని లోపలికి తీసుకెళ్ళింది.

"కూర్చో ఇప్పుడే వచ్చేస్తాను. ఇంటి నిండా గుడ్డలే. వదిలించుకుందామని దాన్ని పిలిచాను. అని ఫెమినా చేతిలో పెట్టింది. పుస్తకం తిరగేస్తూ చూసుంది. ఎంతకీ బేరం తెగడం లేదు కాబోలు - రెండు సార్లు లోపలికి వచ్చి మళ్ళీ ఏవో బట్టలు పట్టుకెళ్ళింది సుజాత.

"ఇందుకే ఆయన పనిమనిషికి పడేయమన్నారు. వీళ్ళకెంత ఇచ్చినా చాలదు. ఇంకా తెమ్మంటూనే వుంటారు. ఆఖరికి ఏ చిన్న వస్తువో చేతిలో పెడతారు. బట్టలన్నీ వదిలించుకున్నాం గదా అన్న సంతోషంతో అది చూసుకుని మురిసిపోతాం. దీని బేరం తెమిలేటట్లు లేదు. ఏం చేస్తోందో చూద్దాం' అని బయటికి వచ్చింది.

ఇచ్చిన బట్టలన్నీ మూట కడుతోంది ఆ మనిషి. ఎలాగయితేం సాధించిన రెండు డబ్బాలకీ మూతల సరిగా ఉన్నాయో లేదో చూసుకుంటోంది సుజాత. అది మంచినీళ్ళడిగితే తేవడానికి లోపలికి వెళ్ళింది. దాని బుట్ట మీద ఉన్న ఇంకొక బట్టల మూట చూసి గతుక్కుమంది శ్యామల. ఉండబట్టలేక మూట లోపల ఉన్న బట్టలని యథాలాపంగా చూస్తున్నట్లు పైకి లాగింది. కళ్ళు తిరిగినట్టయింది.

"ఇంత మంచి బట్టలు ఎవరిచ్చారమ్మా నీకు?" అంది గొంతు పెగల్చుకుని. "ఈ పేట వెనకాతల గుడిసెలున్నాయి కదమ్మా. అక్కడ ఒక మనిషి ఇచ్చింది. ఎవరో పెద్దింటోళ్ళు కట్టుకుంటారు గదాని ఇమ్మంటారు. అది కాస్త నాకు ఇచ్చేసింది. ఆ గిన్నెదో ఆ అమ్మే తీసుకునేది గదా. అన్నీ జపానీ బట్టలే. ఎవరో పాపం! పిచ్చిమాతల్లి." అన్నది.

ఆ మాటవిన్న సుజాత, "నిజమేనే. ఎవర్తో పిచ్చిమొహంలా వుంది. ఈ రోజుల్లో పని మనుషుల మీద జాలిపడడం అన్నంత బుద్ధి తక్కువ లేదు. వాళ్ళకెంత టెక్కు? నేనేం తెలివి తక్కువ దాన్నయి దీన్ని పిలిచాననుకున్నావేంటి? అదేదో మనమే తీసుకోవచ్చు గదా." అంటూ వంక పలికింది.

సుజాత దృష్టి ఏ మాత్రం ఆ బట్టల మూట మీద పడ్డా ఏ చీరో గుర్తు పట్టి, అవి ఇచ్చిన పిచ్చి మొహం ఎవర్తో తెలిసిపోయేది.

ఉక్రోషంతో, భర్త ఇచ్చిన బోడి సలహా పాటించినందుకు ఏడుపొచ్చినంత పనయింది. 'పిచ్చి మా తల్లి' - శ్యామలకి

—బి. జ్యోతి

**ఎవరయితేనేం?**

"అదేమిటో రాణీ... ఈరోజునేను తాగి రాకపోయినా బ్రాందీ వాసన వస్తున్నది?"

"అబ్బ ఎవరు తాగితే ఏంటేండి. ఈ వాసన బాగా అలవాటు అయింది మనకి..." తూలుతూ చెప్పింది రాణి.

—హేమజారమణ